శ్రీమద్భగవద్గీత
Srimad Bhagavad Gita

వ్యాసుడు &

భీష్ముడు

ద్రోణాచార్యుడు

కర్ణుడు

గాంధారి

యుధిష్ఠిరుడు &
ధర్మరాజు

భీముడు & భీమసేనుడు
వృకోదరుడు

అర్జునుడు &
విజయుడు

నకులుడు &
సహదేవుడు

అమరనద్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జున విషాదయోగము

శ్రీ గీతా ధ్యానం

పార్థాయ ప్రతిబోధితాం భగవతా నారాయణేన స్వయం
వ్యాసేన గ్రథితాం పురాణమునినా మధ్యే మహాభారతమ్ |
అద్వైతామృతవర్షిణీం భగవతీమష్టాదశాధ్యాయినీం
అంబ త్వామనుసందధామి భగవద్గీతే భవద్వేషిణీమ్ || 1 ||

నమోఽస్తు తే వ్యాస విశాలబుద్ధే ఫుల్లారవిందాయతపత్రనేత్ర |
యేన త్వయా భారతతైలపూర్ణః ప్రజ్వాలితో జ్ఞానమయః ప్రదీపః || 2 ||

ప్రపన్నపారిజాతాయతోత్రవేత్రైకపాణయే |
జ్ఞానముద్రాయ కృష్ణాయ గీతామృతదుహే నమః || 3 ||

సర్వోపనిషదో గావో దోగ్ధా గోపాలనందనః |
పార్థో వత్సః సుధీర్భోక్తా దుగ్ధం గీతామృతం మహత్ || 4 ||

వసుదేవసుతం దేవం కంసచాణూరమర్దనమ్ |
దేవకీపరమానందం కృష్ణం వందే జగద్గురుమ్ || 5 ||

భీష్మద్రోణతటా జయద్రథజలా గాంధారనీలోత్పలా
శల్యగ్రాహవతీ కృపేణ వహనీ కర్ణేన వేలాకులా |
అశ్వత్థామవికర్ణఘోరమకరా దుర్యోధనావర్తినీ
సోత్తీర్ణా ఖలు పాండవైః రణనదీ కైవర్తకః కేశవః || 6 ||

పారాశర్యవచః సరోజమమలం గీతార్థగంధోత్కటం
నానాఖ్యానకకేసరం హరికథాసంబోధనాబోధితమ్ |
లోకే సజ్జనషట్పదైరహరహః పేపీయమానం ముదా
భూయాద్భారతపంకజం కలిమలప్రధ్వంసి నః శ్రేయసే || 7 ||

మూకం కరోతి వాచాలం పంగుం లంఘయతే గిరిమ్ |
యత్కృపా తమహం వందే పరమానందమాధవమ్ || 8 ||

యం బ్రహ్మా వరుణేంద్రరుద్రమరుతః స్తున్వంతి దివ్యైః స్తవైః
వేదైః సాంగపదక్రమోపనిషదైర్గాయంతి యం సామగాః |
ధ్యానావస్థితతద్గతేన మనసా పశ్యంతి యం యోగినో
యస్యాంతం న విదుః సురాసురగణా దేవాయ తస్మై నమః || 9 ||

అమరనధ్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

ధృతరాష్ట్ర ఉవాచ – ధృతరాష్ట్రుడు యుద్ధము గుఱించి సంజయుని అడిగెను.

ధర్మక్షేత్రే కురుక్షేత్రే సమవేతా యుయుత్సవః |
మామకాః పాండవాశ్చైవ కిమకుర్వత సంజయ || 1 ||

ధర్మక్షేత్రమైన కురు క్షేత్రంలో పాండవులు, కౌరవులు తమ తమ సైన్యాలను మోహరించారు. ఓ సంజయా! ఈ ధర్మక్షేత్రమైన కురుక్షేత్రమునందు యుద్ధము చేయవలెనని కోరిక బలంగా కలిగిన వాళ్లు అయిన నా కుమారులు, మరియు నా తమ్ముడు పాండురాజు కుమారులు, ఏమి చేస్తున్నారు. వివరంగా చెప్పు అని ధృతరాష్టుడు సంజయుని అడగడంతో గీతాశాస్త్రము ప్రారంభం అవుతుంది.

వ్యాసుల వారు భగవద్గీతను ధర్మ అనే పదంతో మొదలుపెట్టారు. ధర్మము అందరూ ఆచరించవలసినది. ధర్మాచరణము అందరికీ అత్యంత ఆవశ్యకము. ధర్మం రక్షింపబడిన నాడు ఆ ధర్మం మనలను రక్షిస్తుంది. అందుకే ధర్మోరక్షతి రక్షిత: అని ఆర్యోక్తి. గీతలో కృష్ణపరమాత్మ ధర్మసంస్థాపనార్థాయ సంభవామి యుగే యుగే అని ఉద్ఘాటించారు. ధర్మమును స్థాపించడానికి ప్రతియుగంలో నేను జన్మిస్తాను అని చెప్పారు. కాబట్టి ధర్మము మానవాళికి అత్యంత ముఖ్యమైన సంపద. అందుకే ఈ భరతభూమి ధర్మక్షేత్రమై విలసిల్లింది. అటువంటి భరతభూమిలో కురుక్షేత్రము ఉంది. కురు మహారాజు పేరిట కురువంశము వర్ధిల్లింది. ఆ కురుమహారాజు యజ్ఞం చేయడానికి ఆ క్షేత్రమును దున్ని చదునుచేసారడు. అందుకని ఈ ప్రదేశమునకు కురుక్షేత్రము అని పేరు వచ్చింది అని చెబుతారు. క్షత్రియ కులమును సమూలంగా నిర్మలించిన పరశురాముడు. వారి రక్తముతో ఇక్కడే తన తండ్రికి తర్పణము విడిచాడనీ, ఆ క్షత్రియుల రక్తం ఐదుపాయలుగా పారిందనీ, దాని పేరే శమంతక పంచకము అనీ అది ఈ కురుక్షేతములో ఉందని చెబుతారు. అటువంటి కురుక్షేత్రములో పాండవులు, కౌరువులు గాజ్యం కోసం యుద్ధం చేయడానికి సన్నద్ధులయ్యారు.

ఈ శ్లోకం ధృతరాష్ట్రుడు సంజయుని అడగడంతో మొదలవుతుంది. ధృతరాష్ట్రుడు అంటే రాష్ట్రమును ధరించిన వాడు. అంటే కురు సామాజ్యమునకు రాజు. ఈ కురు సామాజ్యము ధృతరాష్టరుడు సంపాదించలేదు. అది అతని పిత్రార్జితము. తనది కాని దానిని తనది అనుకునే స్వభావము కలవాడు. ఈ గుణము మనలో చాలా మందికి ఉంది. మనం పుట్టక ముందు ఈ భూమి ఉంది మనం పోయిన తరువాత కూడా ఈ భూమి ఉంటుంది. కాని మనం ఈ భూమి

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

మీద బతికిన సంవత్సరాల పాటు ఈ భూమి నాది అని అనుకుంటున్నాము. మనది కాని భూమి మీద విపరీతమైన మమకారము పెంచుకుంటాము. ఉన్న భూమిని కాపడుకోడానికి, లేని భూమిని ఆక్రమించడానికి నానా తంటాలు పడుతుంటాము. అనేకమైన అడ్డదార్లు తొక్కుతుంటంము సెంటు భూమి కొరకు అయిన వారిని కూడా కడతేర్చేవాళ్లు ఉండటం మనం చూస్తున్నాము. వింటున్నాము. అదే అజ్ఞానము. ఈ అజ్ఞానుము పోగొట్టేదే భగవద్గీత.

కురుక్షేత్రము అంటే కురు రాజుల యొక్క అధీనంలో ఉన్న విశాలమైన కురుభూమి. అక్కడ ఎంతో మంది మునులు, ఋషులు తమ ఆశ్రమాలు నిర్మించుకొని తపస్సు చేసుకుంటున్నారు. పూర్వము బహ్మగారు, ఇంద్రుడు, అగ్ని ఇక్కడ తపస్సు చేసారనీ, కురు వంశ మూల పురుషుడు అయిన కురుమహారాజు ఈ పదేశములో ఎన్నో ధర్మకార్యాలు చేసాడనీ ప్రతీతి. (ప్రస్తుతము ఇది పంజాబురాష్ట్రంలో ఉంది.)

ఇప్పుడు పాండవులు, కౌరవులు, వారి మిత్రపక్షరాజులు అందరూ కలిసి యుద్ధం చేయడానికి ధర్మక్షేత్రము అయిన కురుక్షేత్రలో సిద్ధం అయ్యారు. వారి సైన్యములు అంతా కలిపి *18* అక్షౌహిణీలు . ఒక అక్షౌహిణి అంటే *21,870* రథములు, *21,870* ఏనుగులు, *65,610* గురములు *1,09,350* సైపికులు వీరగంతా కలిసి ఒక అక్షౌహిణి అంటారు. ఇటువంటి అక్షౌసిణీలు పాండవుల పక్షాన *7*, కౌరవుల పక్షాన *11* నిలిచిఉన్నాయి. మరి ఇన్ని లక్షల మంది యుద్ధం చేయాలంటే విశాలమైన భూమి కావాలి కదా .దాని కోరకు భూమిని ఎన్నుకునరు. అప్పటివరకు హోమ ధూమమతోనూ

అసలు మనిషి పుట్టగానే అతడి లేక ఆమె మనసు నిర్మలంగా, ప్రశాంతంగా మాయకంగా ఉంటుంది. పెరిగి పెద్ద అయ్యేకొద్దీ ఇది నాది, అది నీది అనే స్వార్ధము, నీవు వేరు నేను వేరు అనే భేదబుద్ధి, ఇది అంతా నాకే కావాలి, నీకు ఇవ్వను అనే లోభత్వము, నువ్వంటే నాకు పడదు అనే ద్వేషము, నీకు అంత ఉంది, నాకు ఇంతే ఉంది అనే అసూయ క్రమక్రమంగా మన మన పనులను బుద్ధిని కురుక్షేత్రంగా మారస్తాయి. ఈ మంచి చెడుల మధ్య నిత్యం ఘర్షణ జరుగుతూ ఉంటుంది. ఒక్కోసారి మంచి గెలుస్తుంది. మరో సారి చెడు గెలుస్తుంది. దాని వలన సుఖము దుఃఖము ఒకదాని వెంట ఒకటి వస్తుంటాయి. ఇదే సంసారము అనే సాగరము. ఈ సాగరము నుండి బయటపడాలంటే ఒక గట్టి పడవ కావాలి. అదే భగవద్గీత.

అమరనధ్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

దానికి చుక్కాని పట్టేది గురువు. భగవద్గీత అనే పడవ ఎక్కి, శ్రీకృష్ణుడు అనే గురువు సాయంతో ఈ సంసారము అనే సముద్రమును దాటవచ్చు.

ధృతరాష్ట్రుడు పుట్టు గుడ్డి పాండురాజు అరణ్యములకు పోయినప్పటి నుండి తానే రాజు. అయినా రాజ్యకాంక్ష తగ్గలేదు. తన తరువాత తన కుమారులైన కౌరవులకు రాజ్యం కట్టబెట్టాలనే కోరిక బలంగా ఉంది. నిజానికి పాండవులు, కౌరవులు ఇద్దరూ తన కుమారులే. కాని ధృతరాష్ట్రుని భేదబుద్ధి వారిని సమానంగా చూడనివ్వదు. అందుకే నా వాళ్లు, పాండవులు ఏమి చేస్తున్నారు అనే భేదబుద్ధి చూపించాడు. ధృతరాష్ట్రుడు అడిగిన ప్రశ్నకు సంజయుడు ఈ విధంగా సమాధానం చెప్పాడు

సంజయ ఉవాచ :- దుర్యోధనుడు ద్రోణాచార్యులతో పాండవుల వ్యూహమును, సేనను చూడుడని పలికిన విషయమును సంజయడు పలికేను.

యుద్ధరంగంలోని మహావీరుల వర్ణన

భగవద్గీత
మొదటి అధ్యాయము
అర్జునవిషాదయోగః

సంజయ ఉవాచ -

దృష్ట్వా తు పాండవానీకం వ్యూఢం దుర్యోధనస్తదా |
ఆచార్యముపసంగమ్య రాజా వచనమబ్రవీత్ || 2 ||

సంజయుడు పలికెను - ఆ సమయమున రాజైన దుర్యోధనుడు వ్యూహరచనతో యుద్ధమునకు మోహరించి యున్న పాండవుల సైన్యమును చూచి, ద్రోణాచార్యుని సమీపించి ఈ విధముగా పలికినాడు.

పాండవుల సేనాధిపతి ఐన దృష్టద్యుమ్నుడు వజ్రవ్యూహం పన్ని తన సేనలను నిలబెట్టాడు. అది చూసి దుర్యోధనుడు కొద్దిగా భీతి చెందాడు. ఆ విషయం వెంటనే న గురువుకు తెలియజేయాలని ద్రోణాచార్యుల వద్దకు వెళ్ళాడు. (సేనాధిపతి ఒక వ్యూహం పన్ని తన సైన్యాన్ని నిలబెడితే, అవతలి వారు ఆ వ్యూహాన్ని ఛేదించడం తెలిసిన వారైతే తప్ప సైన్యంలోనికి ప్రవేశించి యుద్ధం చెయ్యలేరు. అందుకే తరువాత కౌరవులు పద్మవ్యూహం పన్నితే, అది ఛేదించడం తెలిసిన వాడు కనుక బాలుడైన అభిమన్యుడిని నియోగించారు.) ఓం నమో భగవతే వాసుదేవాయ!

తనను చంపడానికే పుట్టిన ధృష్టద్యుమ్నడిని ద్రోణుడు చంపుతాడా? లేక శిష్యుడు అని ఉపేక్ష వహిస్తాడా అన్న సందేహము దుర్యోధనిడిలో మొలకెత్తింది. ఈ విషయం తేల్చుకోడానికే నేరుగా ద్రోణాచార్యుల వద్దకు వెళ్లి ఇలా అంటున్నాడు.

పశ్యైతాం పాండుపుత్రాణామాచార్య మహతీం చమూమ్ |
వ్యూఢాం ద్రుపదపుత్రేణ తవ శిష్యేణ ధీమతా || 3 ||

గురువుగారూ! నమస్కారం. ఒక్కసారి పాండవుల వైపు ఉన్న సేనాసముద్రాన్ని చూడండి. ఆ సైన్యం ముందు ఠీవిగా నిలబడి ఉన్న పాండవుల సర్వసైన్యాధ్యక్షుడు ధృష్టద్యుమ్నుని చూడండి. ఆయన ఎవరో కాదు! తమరి శిష్యుడే. తమరే అతనికి విలువిద్య నేర్పించారు. తమరే ధృష్టద్యుమ్నుని మహా బుద్ధిమంతుడు అని పొగిడేవారు. కాని ఆచార్య! ఆయన మీ బద్ధశత్రువు ద్రుపదుని కుమారుడు అని మరిచిపోకండి మీరు తనకు చేసిన అవమానాన్ని భరించలేక, కేవలం మిమ్ముల్ని చంపడానికే తపస్సుచేసి, ధృష్టద్యుమ్నుని కుమారుడిగా పొందాడు. ధృష్టద్యుమ్నుడు మీ శిష్యుడు, బుద్ధి మంతుడు అని ఉపేక్షచేస్తారో, మీ బద్ధశత్రువు దరుపదుని కుమారుడనీ, మిమ్మల్ని చంపడానికే పుట్టాడనీ అతని పట్ల కఠినంగా వ్యవహరిస్తారో, మీ ఇష్టం అనే అర్థం వచ్చేటట్టు నర్మగర్భంగా మాట్లాడాడు దుర్యోధనుడు. తన రాజకీయ చతురత నంతా ఇక్కడ మాటల్లో చూపించాడు దుర్యోధనుడు.

అమరనధ్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

దుర్యోధనుని పక్షాన 11 అక్షౌహిణీల సైన్యం ఉంది. పాండవుల పక్షాన కేవలం 7అక్షౌహిణీల సైన్యంమాత్రమే ఉంది. కాని పాండవుల పక్షాన ధర్మము, ధర్మానికి ప్రతినిధి అయిన శ్రీకృష్ణుడు ఉన్నాడు. కాని దుర్యోధనుడి పక్షాన అధర్మం ఉంది. భీముడికి బాలుడుగా ఉండగానే విషం పెట్టాడు. వారిని లక్క ఇంట్లో పెట్టి సజీవదహనం చేయాలని చూచాడు. అక్రమంగా పాండవుల రాజ్యం లాక్కోవడమే కాక, వారి భార్యను అవమానించాడు. అడవులకు పంపాడు. తిరిగి వచ్చి వారు తమ రాజ్యం తమకు ఇమ్మని అడిగితే సూదిమొన మోపినంత భూమికూడా ఇవ్వను అన్నాడు. ఇవన్నీ అధర్మాలనీ, అధర్మం తన పక్షాన ఉందనీ దుర్యోధనుడికి తెలుసు. అందకే దుర్యోధనుడు అభద్రతా భావంతో ఉన్నాడు. తమ కంటే చిన్నదైన పాండవుల సైన్యం పేద్దభూతంలాగా కనపడుతూ ఉంది. అందుకే.

"మహతీంచమూమ్" అంటే గొప్పదైన పాండవుల సైన్యం చూడండి అని అన్నాడు. మనలో కూడా ఎంత ఎక్కువ ధనం, ఆస్తి, పదవులు ఉంటే అంత అభద్రతా భావం ఉంటుంది. ముందు వెనుక సెక్యూరిటీ గార్డులను పెట్టుకుంటారు. ప్రతి చిన్న విషయానికీ భయపడతాడు. ఏమీ లేని వాడు నిర్భయంగా, హాయిగా కులాసాగా ఒంటరిగా తిరుగుతాడు. అందుకనే ఎక్కువ సైన్యం ఉన్నప్పటికి సుయోధనుడికి అభద్రతాభావం పోలేదు. దుర్యోధనుని మాటలతో ఒళ్లుమండింది ద్రోణుడికి, దుర్యోధనుని వంక తీక్షణంగా చూచాడు. దుర్యోధనుడు సర్దుకున్నాడు. అందరి మాదిరే దృష్టద్యుమ్నుని గురించి కూడా అడిగాననే అర్థం వచ్చేటట్టు ఇతర వీరుల గురించి ఇలా అన్నాడు.

అత్ర శూరా మహేష్వాసా భీమార్జునసమా యుధి |
యుయుధానో విరాటశ్చ ద్రుపదశ్చ మహారథః || 4 ||
ధృష్టకేతుశ్చేకితానః కాశిరాజశ్చ వీర్యవాన్ |
పురుజిత్కుంతిభోజశ్చ శైబ్యశ్చ నరపుంగవః || 5 ||
యుధామన్యుశ్చ విక్రాన్త ఉత్తమౌజాశ్చ వీర్యవాన్ |
సౌభద్రో ద్రౌపదేయాశ్చ సర్వ ఏవ మహారథాః || 6 ||

తనలో తాను సర్దుకున్న దుర్యోధనుడు ద్రోణాచార్యులతో ఇలా అన్నాడు. "ఆచార్యవర్యా! ముందు కేవలం పాండవ సైన్యాధ్యక్షుని గురించి చెప్పాను అంతే. అయినా తమరికి తెలియనిది కాదు. ఏదో నా తృప్తి కొరకు పాండవుల సైన్యములో ఉన్న మహారథుల గురించి చెబుతున్నాను శ్రీకృష్ణుడు

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

తమ్ముడు సాత్యకి, మహారథి అనే పేరుగాంచిన విరాట మహారాజు, ధృష్టకేతుడు చేకితానుడు, మహా పరాక్రమశాలి అయిన కాశీరాజు, పురుజిత్తు, కుంతిభోజుడు, శైబ్యుడు, మహాపరాక్రమ వంతుడైన యుధామన్యుడు, మహావీరుడు లభిమన్యుడు, ఇంక ద్రౌపదీ కుమారులైన ఉపపాండవులు, వీరంతా మహారథులు. వీరి ధనుస్సులు చాలా పటిష్టమైనవి. వీరందరూ ధనుర్విద్యాపారంగతులు. వీరంతా భీముడు, అర్జునుడితో సమానంగా యుద్ధం చేయగల సామర్థ్యం (మహాగధి అంటే ఒకే సమయంలో పదివేల మంది సైనికులతో యుద్ధం చేయగల సమర్థులు ఉన్న వాడు అని ఒక అర్థం. వేరు వేరు చోట్ల వేరు అర్థాలు ఉన్నాయి.) మరి వీళ్ల సంగతి ద్రోణుడికి తెలియదా! తెలుసు. కానీ ఎదుటి బలమును, తన బలమును అంచనా వేయడం యుద్ధనీతి. అందుకే ఈ వివరాలు చెప్పాడు. ఇంక తన పక్షానున్న వీరుల గురించి కూడా చెబుతున్నాడు దుర్యోధనుడు

అస్మాకం తు విశిష్టా యే తాన్నిబోధ ద్విజోత్తమ |
నాయకా మమ సైన్యస్య సంజ్ఞార్థం తాన్బ్రవీమి తే || 7 ||

ఆచార్మవర్యా! తమకు తెలియదు అని కాదు. మన పక్షంలో ఉన్న మహా రథుల గురించి కూడా చెప్పుకుంటే నా మనసుకు కొంచెం ధైర్యంగా ఉంటుంది కదా! అందుకని కేవలం తమరి గర్తుకోసం మన వైపు ఉన్న యోధానుయోధుల గురించి చెబుతాను వినండి.

ఈ శ్లోకంలో ద్విజోత్తమ అని గురువుగారు ద్రోణాచార్యుని సంబోధించాడు దుర్యోధనుడు. ద్రిజోత్తమ అంటే బ్రాహ్మణోత్మమా! అనిఅర్థం. బ్రాహ్మణుడు గురువుగా తన శిష్యులకు సమస్త విద్యలు నేర్పవచ్చు, విద్య అంటే ధనుర్విద్య, యుద్ధవిద్యకూడా వస్తాయి. కాబట్టి యుద్ధవిద్యలు బ్రాహ్మణుడు నేర్పవచ్చు కానీ యుద్ధం ఎందుకంటే యద్ధం హింసతో కూడుకన్నది. బాహ్మణుడికి హింస చేయడం ధర్మం కాదు. అందుకని వ్యసులవారు ఎత్తిపోడుపుగా ఈపదం వడిఉండవచ్చు. కాని దర్యోధనుడి ఆ భావన ఉండవచ్చు. కాని దుర్యోధనుడికి ఆ భావన ఉన్నట్టు కనిపించదు.

భవాన్భీష్మశ్చ కర్ణశ్చ కృపశ్చ సమితింజయః |
అశ్వత్థామా వికర్ణశ్చ సౌమదత్తిస్తథైవ చ || 8 ||
అన్యే చ బహవః శూరా మదర్థే త్యక్తజీవితాః |
నానాశస్త్రప్రహరణాః సర్వే యుద్ధవిశారదాః || 9 ||

అమరనథ్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

గురువర్యా! మా పక్షాన తమరు ఉన్నారు. ఇంక మాకేం భయం. అదికాకుండా పితామహులు భీష్మలవారు, మహారథి కర్ణుడు, అపజయం అంటే ఏమిటో ఎరుగని కృపాచార్యులు, తమరి కుమారుడు అశ్వత్థామ, వికర్ణుడు, సోమదత్తుడు వీళ్లంతా మన పక్షాన ఉన్నారు ఆచార్యా! వీళ్లే కాదు ఇంకా ఎంతో మంది వీరులు, శూరులు నా కోసం తమ ప్రాణాలు ఇవ్వడానికి సిద్ధంగా ఉన్నారు. నా గురించి, నా గెలుపు గురించి తమ పాణాలు ప్రాణంగా పెట్టి యుద్ధం చేయడానికి ఎంతో మంది యుద్ధవిద్యలో నైపుణ్యం కలిగిన వారు, పలురకములైన అస్త్రములను, శస్త్రములను ప్రయోగించడంలో నిపుణులు, మన వైపు యుద్ధం చేయడానికి ఉరకలు వేస్తున్నారు. "

అని ధీమా వ్యక్తం చేసాడు దుర్యోధనుడు. ఇక్కడ ఒక విషయం మనం గమనించాలి. ఎంతో మంది వీరులు, పరాక్రమ వంతులు నా కోసం యుద్ధం చేయడానికి వచ్చారు అంటే బాగుండేదేమో కానీ దుర్యోధనుని నోటి వెంట వీరంతా నా కోసం తమ ప్రాణాలను విడుస్తారు అనే మాటలు వెలువడ్డాయి. . ఆఖరుకు జరిగింది అదేకదా. రాబోయే అపజయాన్ని సూచించే మాటలు దుర్యోధనుని నోటి వెంట రావడం దైవసంకల్పంగానే భావించాలి.

అపర్యాప్తం తదస్మాకం బలం భీష్మాభిరక్షితమ్ |
పర్యాప్తం త్విదమేతేషాం బలం భీమాభిరక్షితమ్ || 10 ||

భీష్మపితామహునిచే రక్షింపబడుతున్న మన సేన అపరిమితమైనది. కాని, భీముడిచే రక్షింపబడుతున్న సైన్యము సంఖ్యాపరంగా పరిమితమైనది. పాండవులది ఏడు అక్షౌహిణుల సైన్యం. కౌరవులది పదకొండు అక్షౌహిణుల సైన్యం. అందువలన వారిని తేలికగా జయించవచ్చు అని మనసులో సమాధాన పడుతున్నాడు.)

ఇక్కడ విశేషమేమంటే తన సైన్యం భీష్మాభిరక్షితమ్ అని దుర్యోధనుడు అన్నాడు. భీష్మాచార్యులవారు సైన్యాధిపత్యం వహిస్తున్నందు వలన అలా అనడమే ఉచితం. కాని పాండవుల సేనకు ధృష్టద్యుమ్నుడు నాయకత్వం వహిస్తుండగా భీమాభిరక్షితమ్ అని ఎందుకన్నాడు? దానికి రెండు కారణాలున్నాయి. లోగడ మనం చెప్పుకున్నాము. (4 వ శ్లోకం) పాండవుల సేనలో భీమార్జునులతో సమానమైన పరాక్రమం గల సైనికులెందరో పాండవ సైన్యంలో వున్నారని దుర్యోధనుడు అన్నాడు. ఎందుకంటే దుర్యోధనుడు వారిద్దరిని చూచి భయపడుతున్నాడు. పైగా భీముడు ప్రతిజ్ఞలు చేసి, కౌరవుల నందరినీ మట్టుపెట్టడానికి కృతనిశ్చయుడై వున్నాడు. అందుకని సేనాధిపతి ధృష్టద్యుమ్నుడైనప్పటికీ, భీముడు ఆ సైన్యాన్నంతటినీ రక్షిస్తున్నాడు కనుక అలా అన్నాడు.

అమరనాథ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

ఇక రెండవ కారణమేమంటే, కురుక్షేత్రసంగ్రామం యొక్క మొదటి రోజున ధృష్టద్యుమ్నుడు తన సేనను వజ్రవ్యూహం రచించి నిలబెట్టాడు. ఆ వ్యూహాన్ని రక్షించడానికి అగ్రభాగాన భీముడిని నిలబెట్టాడు. అందువలన వజ్రవ్యూహాకారంలో వున్న పాండవుల సేనను అగ్రభాగాన నిలచి భీముడు రక్షిస్తున్నందు వలన భీమాభిరక్షితమ్ అన్నాడు.

అయనేషు చ సర్వేషు యథాభాగమవస్థితాః |
భీష్మమేవాభిరక్షంతు భవంతః సర్వ ఏవ హి || 11 ||

భీష్ముడొక్కడు క్షేమంగా వుంటే, తన సైన్యమంతా క్షేమంగానే వుంటుందని దుర్యోధనుడికి తెలుసు. ఎందుకంటే ఆయన ఒక్కడే ఎదురు నిలబడి శత్రుసైన్యం మొత్తాన్ని సంహరించ గలడు. అందుకే ఆయనను రక్షించ వలసిన బాధ్యతను మిగిలిన సైన్యానికి అప్పజెప్పాడు. అంతేకాదు, ద్రుపదుడి కొడుకు అయిన శిఖండి మొదట్లో స్త్రీ రూపం కలిగి వున్నందు వలన పేడి అయిన అతడితో తాను యుద్ధం చెయ్యనని భీష్ముడు ప్రతిజ్ఞ చేసాడు. ఇప్పుడు పాండవులు శిఖండిని భీష్మునికి ఎదురుగా నిలబెడితే, ఆయన శస్త్రాలను వదిలిపెట్టేస్తాడు. ఆ పరిస్థితే వస్తే శిఖండిని సంహరించేంత వరకు, ఆయనను కాపాడుకోవలసిన బాధ్యత మిగిలిన సైన్యానికి వుంటుంది.

తస్య సంజనయన్హర్షం కురువృద్ధః పితామహః |
సింహనాదం వినద్యోచ్చైః శంఖం దధ్మౌ ప్రతాపవాన్ || 12 ||

ఈ మాటలు అన్నీ విన్నాడు భీష్ముడు. ఆ మాటలలో అంతరార్థం గ్రహించాడు. ఏనాడూ తన మాట వినని, తన మాట లక్ష్య పెట్టని దుర్యోధనుడు, ఈ నాడు తనను మాత్రం అందరూ రక్షించాలని తన మీద అమితమైన శ్రద్ధ చూపిస్తున్నాడు అంటే సుయోధనుడి మనసులో యుద్ధభయం ప్రవేశించింది అని తెలుసుకున్నాడు. దుర్యోధనుడిని ఉత్సాహపరచడానికి వాడిలో ధైర్యం కలిగించడానికి భీష్ముడు సింహంలా గర్జించాడు. తన శంఖాన్ని గట్టిగా పూరించాడు. యుద్ధమునకు సన్నద్ధంకండి అనే సూచన ఇవ్వడానికి గుర్తుగా సైన్యాధ్యక్షుడు తన శంఖం పూరించాడు.

తతః శంఖాశ్చ భేర్యశ్చ పణవానకగోముఖాః |
సహసైవాభ్యహన్యంత స శబ్దస్తుములోఽభవత్ || 13 ||

అమరనథ్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

(చిన్న గమనిక. ఈ శ్లోకం గుండి తరువాతి శ్లోకాలలో 2 ఉన్న చోట అవగ్రహ అని చదువుకోవాలి. అవగ్రహ నా సిస్టమ్ లో లేనందు వలన, అదే మాదిరి ఉన్న 2 ను వాడాను అవగ్రహ అంటే అక్కడ అ కారాన్ని చదువుకోవాలి.)

తమ సైన్యాధ్యక్షుడు అయిన భీష్ముడు యుద్ధం ఆరంభానికి గుర్తుగా శంఖం పూరించగానే కౌరవ సేవలలో ఉత్సాహం పెల్లుబికింది. కౌరవసేనలకు అధిపతులు అందరూ తమ తమ శంఖములను గట్టిగా పూరించారు సైనికులు వివిధములైన వాద్యములను, అంటే నగారాలు, తప్పెట్లు, మృదంగములు, గోముఖములు అనే వాద్యములు మొదలగు వాద్యములను గట్టిగా మోగించారు. ఆ భయంకరమైన ధ్వనులతో భూమి ఆకాశము దద్దరిల్లాయి.

తతః శ్వేతైర్హయైర్యుక్తే మహతి స్యందనే స్థితౌ |
మాధవః పాండవశ్చైవ దివ్యౌ శంఖౌ ప్రదధ్మతుః || 14 ||

తరువాత తెల్ల గుర్రములను పూన్చిన రథము మీద ఉన్న అర్జునుడు, సారధి కృష్ణుడు తమ తమ శంఖములను పూరించారు. సాధారణంగా ముందు సైన్యాధ్యక్షుడు తన శంఖం పూరించాలి. కాని కృష్ణుని మీద ఉన్న గౌరవం చేత, ముందు కృష్ణుడు శంఖం పూరించిన తరువాత మిగిలిన వారు తమ తమ శంఖములను పూరించారు. ఇక్కడ ఒక విషయం గమనించాలి. కృష్ణుడు కేవలం అర్జునుడి రథ సారధి. కాని ఆయన చేస్తున్న పనిని బట్టి కాకుండా వ్యక్తిగా ఆయనకున్న జ్ఞానాన్ని పరిణతిని, గౌరవాన్ని గొప్పతనాన్ని గుర్తించారు పాండవులు. అందుకే రాజసూయ యాగంలో ఆయనకు అగ్రపూజ చేసారు. ఇక్కడ కూడా యుద్ధ ప్రారంభం సూచికగా మొట్ట మొదట శంఖం పూరించే గౌరవం కృష్ణుడికి ఇచ్చారు. కాబట్టి మన వ్యక్తిత్వం, మన గుణగణాలు, మంచి ప్రవర్తన మనకు గౌరవం తెచ్చిపెడతాయి కానీ మనం చేస్తున్న ఉద్యోగం, పదవి, సంపదలు కాదు అని అందరూ తెలుసుకోవాలి. ఈ శ్లోకంలో కృష్ణుని మాధవుడు అని సంబోధించాడు వ్యాసుడు. మా అంటే లక్ష్మీదేవి ధవుడు అంటే భర్త మాధవుడు అంటే లక్ష్మీదేవి భర్త. లక్ష్మీదేవి విజయానికి గుర్తు. విజయలక్ష్మి ఆమె. కాబట్టి మాధవుడు విజయ శంఖం పూరించాడు అంటే పాండవుల విజయం తథ్యం అనే సంకేతాన్ని ముందే మనకు ఇచ్చాడు వ్యాసుడు.

పాంచజన్యం హృషీకేశో దేవదత్తం ధనంజయః |
పౌండ్రం దధ్మౌ మహాశంఖం భీమకర్మా వృకోదరః || 15 ||

అమరనథ్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

శ్రీకృష్ణపరమాత్మ తన పాంచజన్యమును, అర్జునుడు తన దేవదత్తమును, భీముడు తన పౌండ్రమను శంఖమును పూరించిరి. పంచజనుడనే రాక్షసుని ఎముకలచే ఏర్పడినది పాంచజన్యం. రాజసూయ యాగానికి అనేక రాజుల నుంచి ధనమును సంపాదించి తెచ్చినందు వల్లను, ధనాన్ని గూర్చిన ఆశను జయించిన వాడవటం వల్లను అర్జునుడికి ధనంజయుడు అని పేరు వచ్చింది. అన్నిటిని భస్మం చేసే వృకము అనే అగ్ని ఉదరంలో కలిగి వున్నందు వల్లను, వృకము అనగా తోడేలు యొక్క ఉదరము వంటి ఉదరము కలవాడు కనుకనున్న భీముడికి వృకోదరుడు అన్న పేరు వచ్చింది.

అనంతవిజయం రాజా కుంతీపుత్రో యుధిష్ఠిరః |
నకులః సహదేవశ్చ సుఘోషమణిపుష్పకౌ || 16 ||

రాజు, కుంతీపుత్రుడు అగు యుధిష్ఠిరుడు అనంతవిజయము అను శంఖమును, నకులుడు సుఘోషము, సహదేవుడు మణిపుష్పకము అను శంఖములను పూరించిరి.

కాశ్యశ్చ పరమేష్వాసః శిఖండీ చ మహారథః |
ధృష్టద్యుమ్నో విరాటశ్చ సాత్యకిశ్చాపరాజితః || 17 ||
ద్రుపదో ద్రౌపదేయాశ్చ సర్వశః పృథివీపతే |
సౌభద్రశ్చ మహాబాహుః శంఖాన్దధ్ముః పృథక్పృథక్ || 18 ||

ఓ రాజా! మహాధనుర్ధారి అయిన కాశీరాజు, మహారథుడైన శిఖండియు, ధృష్టద్యుమ్నుడును, విరాటరాజు, అజేయుడైన సాత్యకియు, ద్రుపదమహారాజు, ద్రౌపది యొక్క ఐదుగురు పుత్రులు, భుజబలశాలి యగు సుభద్రాతనయుడు అభిమన్యుడును తమ తమ శంఖములను వేరు వేరుగా పూరించిరి.

స ఘోషో ధార్తరాష్ట్రాణాం హృదయాని వ్యదారయత్ |
నభశ్చ పృథివీం చైవ తుములోऽభ్యనునాదయన్ || 19 ||

శ్రీకృష్ణుడు, పాండవులు, వారి మితపక్షరాజులు చేసిన శంఖనాదములు భూమి ఆకాశములలో పతిధ్వనించాయి. పాండవ వీరుల శంఖనాదములు విని కౌరవ వీరుల హృదయాలు బద్దలయ్యాయి. పాండవ వీరుల శంఖనాదాలే ఇంత భయంకరంగా ఉన్నాయి ఇంక వీరి యుద్ధం, అస్త్ర శస్త్ర విన్యాసము ఎలా ఉంటుందో అని మనసులో గుబులు పడ్డారు కౌరవ వీరులు. ఈ శ్లోకంలో ధార్తరాష్ట్రాన్ అనే పదం వాడారు. ఎందుకంటే కౌరవులు అంటే కురు వంశమునకు చెందిన వారు. పాండవులు కూడా కురు వంశమునకు చెందిన వారు కాబట్టి కౌరవులే. కాని ధార్తరాష్ట్రాన్ అంటే ధృతరాష్ట్రుని సంతతి, వారి సైన్యము అని వాడి నందువలన

అరుణ్ కుమార్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

పాండవులు వారి సైన్యము చేసిన శంఖనాదములు, వాద్యఘోషను విని ధృతరాష్ట్రుని పుత్రులు వారి అనుయాయులు, సైన్యము, భయంతో కంపించి పోయారు అని వ్యాసుల వారు చమత్కరించారు.

అథ వ్యవస్థితాన్ దృష్ట్వా ధార్తరాష్ట్రాన్ కపిధ్వజః |
ప్రవృత్తే శస్త్రసంపాతే ధనురుద్యమ్య పాండవః ||20 ||
హృషీకేశం తదా వాక్యమ్ ఇదమాహ మహీపతే |

అర్జున ఉవాచ:

సేనయోరుభయోర్మధ్యే రథం స్థాపయ మేఽచ్యుత || 21 ||

ఓ ధృతరాష్ట్ర మహారాజా! పిమ్మట యుద్ధమునకై నడుము బిగించి సమర సన్నద్ధులై యున్న ధార్తరాష్ట్రులను చూచి, కపిధ్వజుడైన అర్జునుడు ధనుస్సును పైకెత్తి శ్రీకృష్ణునితో ఇట్లనెను, 'ఓ అచ్యుతా! నా రథమును ఉభయసేనల మధ్య నిలుపుము.

కపిధ్వజుడు = భారతం లోని అరణ్యపర్వంలో భీముని ప్రార్థనను అనుసరించి హనుమంతుడు తాను పాండవులకి విజయం చేకూరే నిమిత్తం అర్జునుని రథం యొక్క పై భాగాన కూర్చుని వుంటానని వరమిచ్చాడు. అందువలన అర్జునునికి ఈ పేరు వచ్చింది.

యావదేతాన్ నిరీక్షేఽహం యోద్ధుకామానవస్థితాన్ |
కైర్మయా సహ యోద్ధవ్యమ్ అస్మిన్ రణసముద్యమే || 22 ||

రణరంగమునందు యుద్ధాభిలాషులై నిలచియున్న ప్రతిపక్షయోధులందరను బాగుగా పరిశీలించునంత వరకును, వారిలో ఎవరితో నేను యుద్ధము చేయవలసి యున్నదో గమనించునంత వరకు రథమును నిలిపియుంచుము. యుద్ధంలో శత్రువులతో తలపడడానికి ముందుగా అసలు శత్రుపక్షంలో ఎవరెవరు వున్నారు, వారు ఎంతటి పరాక్రమవంతులు, యుద్ధరంగంలో వారు ఏ వ్యూహంలో నిలబెట్టబడి వున్నారు, ఆ వ్యూహాన్ని తాను ఏ విధంగా ఛేదించాలి - ఇటువంటి విషయాల నన్నింటినీ ఆకళింపు చేసుకోవడం చాలా అవసరం. అందుకే అర్జునుడు శ్రీకృష్ణుడిని ఆ విధంగా కోరడం జరిగింది.

యోత్స్యమానానవేక్షేఽహం య ఏతేఽత్ర సమాగతాః |
ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేర్యుద్ధే ప్రియచికీర్షవః || 23 ||

దుర్బుద్ధియైన దుర్యోధనునకు ప్రియమును గూర్చుటకై యుద్ధమున పాల్గొనదలచి

అమరనథ్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

వచ్చియున్న రాజలందరను ఒక సారి చూచెదను. ధార్తరాష్ట్రస్య దుర్బుద్ధేః = అని అర్జునుడు అన్నాడు. అంటే దుర్బుద్ధి గల ధృతరాష్ట్రుని, కుమారుడు అనా, లేక, ధృతరాష్ట్రుని దుర్బుద్ధి గల కుమారుడగు దుర్యోధనుడు అనా? ఇద్దరికీ చెందుతుంది అని నా భావన. ఎందుకంటే, ధృతరాష్ట్రుడు రాజు. నిర్ణయాధికారం అతడిది. ఐనా పుత్రవ్యామోహంలో పడి, పాండవులకు వారికివ్వ వలసిన రాజ్యాన్ని ఇవ్వలేదు. అలాగే దుర్యోధనుడు తమకు ఐదు ఊళ్ళిచ్చినా చాలు అని కబురు పెట్టినా, సూదిమొన మోపేటంత జాగా కూడా ఇవ్వము అని భీష్మించుకు కూర్చున్నాడు. బుద్ధి నాశ్యాత్ ప్రణశ్యతి. బుద్ధి చెడినవాడు నశించిపోవునని గీతలో పరమాత్మ చెప్పాడు. ఇక్కడ బుద్ధి చెడిన దుర్యోధనునకు నాశము తప్పదు అని చెప్పడం కూడా ఉద్దేశ్యం. మన శిక్షాస్మృతి ప్రకారం నేరానికి సహకరించడం కూడ నేరమే.

ప్రియచికీర్షవః = దుర్బుద్ధి గల దుర్యోధనుడికి ప్రీతి కలిగించడానికి యుద్ధంలో ఆతడికి కొందరు సహకరించారు. పాపానికి సహకరించిన వారు కూడా పాపులే కదా? అందువల్లనే వారందరూ కూడా సంగ్రామంలో నిహతులైనారు.

సంజయ ఉవాచ -

ఏవముక్తో హృషీకేశో గుడాకేశేన భారత |
సేనయోరుభయోర్మధ్యే స్థాపయిత్వా రథోత్తమమ్ || 24 ||
భీష్మద్రోణప్రముఖతః సర్వేషాం చ మహీక్షితామ్ |
ఉవాచ పార్థ పశ్యైతాన్సమవేతాన్కురూనితి || 25 ||

అర్జునుడు రథికుడు. కృష్ణుడు సారథి అంటే డ్రైవర్. డ్రైవర్ యజమాని మాట వినాలి. రథం ఎలా పోనిమ్మంటే అలా పోనివ్వాలి. ఇప్పుడెందుకయ్యా చూడ్డం అంతా తెలిసిన వాళ్లే కదా అని అనలేదు కృష్ణుడు . అర్జునుడు చెప్పగానే బుద్ధిగా రథాన్ని ఇరుసైన్యముల మధ్య నిలిపాడు అక్కడి నుండి కౌరవ సేనలు, కౌరవ సైన్యంలో ఉన్న ప్రముఖులు అనగా భీష్ముడు, ద్రోణుడు. కృపాచార్యుయుడు, అశ్వత్థామ అందరూ చక్కగా కనపడుతున్నారు. అర్జునా! నువ్వు కోరినట్టు రథం తీసుకొచ్చి ఇరుపక్షముల సేనల మధ్యలో నిలిపాను. అందరినీ తేరిపార చూడు. కౌరవపక్షంలో ఎవరెవరు వీరులు ఉన్నారో నీవు ఎవరెవరితో పాధాన్య కమంలో యుద్ధం చేయాలో నిర్ణయించుకో. నువ్వు ఎవరిమీదికి రథం పోనిమ్మంటే వారి మీదికి రథం పోనిస్తాను. నీ ఇష్టం అని అన్నాడు కృష్ణుడు. గుడాకేశ అంటే నిద్రను జయించిన వాడు. అనగా తమస్సును జయించినవాడు అని అర్థం. ఇప్పటివరకు అర్జునుడు

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

రజోగుణసంపన్నుడు కానీ కాసేపట్లో తమస్సులో పడబోతున్నాడు అని వ్యాసులవారు సూచిస్తున్నారు.

ఇక్కడ అర్జునుడు నరుడు. కృష్ణుడు నారాయణుడు. అర్జునుడిలో కూడా పరమాత్మ ఆత్మస్వరూపుడుగా ఉన్నాడు కాని ఆ విషయం అయనకు తెలియదు. కృష్ణుడికి తాను పరమాత్మ అంశ అని తెలుసు. ఇదే వారి ఇద్దరి మధ్య భేదం. మనం కూడా ఇంతే. మనం అందరం ఆత్మస్వరూపులము అని తెలుసుకుంటే చిక్కేలేదు. మనలను పుట్టించే వరకే పరమాత్మ బాధ్యత. ఈ భూమి మీద పడ్డ తరువాత మన ఇష్టం. పరమాత్మ ఏమీ జోక్యం కలిగించుకోడు. ఎంత కాలం ఉండాలో అంతకాలం ఉంచుతాడు. తరువాత మృత్యురూపంలో కబళిస్తాడు. అలాగే కృష్ణుడు కూడా అర్జునుడికి స్వేచ్ఛ ఇచ్చాడు. పరమాత్మ, మనలో ఆత్మమస్వరూపుడుగా ఉండి ఎలా సాక్షీభూతుడుగా చూస్తున్నాడో, అలాగే కృష్ణుడు కూడా అర్జునుడికి సారధిగా ఉండి, కేవలం ఒకసాక్షిగా చూస్తున్నాడు. యుద్ధం చేయడం చేయక పోవడం అర్జునుడి ఇష్టం. అవసరం వచ్చినపుడు కర్తవ్యబోధ చేయడం అయన ఆకర్తవ్యం.

తత్రాపశ్యత్ స్థితాన్ పార్థః పితౄనథ పితామహాన్ |
ఆచార్యాన్మాతులాన్ భ్రాతౄన్ పుత్రాన్ పౌత్రాన్ సఖీంస్తథా |
శ్వశురాన్సుహృదశ్చైవ సేనయోరుభయోరపి || 26 ||

తరువాత అర్జునుడు ఆ ఉభయసేనల యందును చేరియున్న పెదతండ్రులను, పినతండ్రులను, తాత ముత్తాతలను, గురువులను, మేనమామలను, సోదరులను, పుత్రులను, పౌత్రులను, మిత్రులను, పిల్లనిచ్చిన మామలను, మున్నగు ఆత్మీయులందరను చూచెను. ఉభయసేనలయందు అని చెప్పడం వలన, కౌరవసైన్యంలో వున్నవారినే కాకుండా, తమ సైన్యంలో ఉన్నవారందరినీ కూడా అర్జునుడు పరికించి చూచాడు.

తాన్సమీక్ష్య స కౌంతేయః సర్వాన్బంధూనవస్థితాన్ |
కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్ || 27 ||

యుద్ధరంగములో నున్న బంధువులందరను చూచి, కుంతీపుత్రుడైన అర్జునుడు అత్యంత కరుణార్ద్ర హృదయుడై శోకించుచు ఇట్లు పలికెను. పొరుగు రాజ్యాలమీద యుద్ధం అంటే అది వేరు. కాని ఇక్కడ జరుగుతున్నది దాయాదుల మధ్య పోరు. అటు చూచినా, ఇటు చూచినా పరాయి వారెవరున్నారు? తాతగారైన భీష్ములవారు, గురువర్యులైన ద్రోణాచార్యులవారు, అన్నలు, తమ్ముళ్ళు, వారి కుమారులు

అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

ఎటుచూచినా అంతా బంధువర్గమే. అందుకే అర్జునునికి దుఃఖం కలిగింది.

కృపయా పరయావిష్టో విషీదన్నిదమబ్రవీత్ |

అర్జున ఉవాచ -

దృష్ట్వేమం స్వజనం కృష్ణ యుయుత్సుమ్ సముపస్థితమ్ || 28 ||

మరలా ఒక సారి అందరినీ తేరిపారచూచాడు. దు:ఖం ఆగలేదు. మనసంతా కరుణ, జాలి, దు:ఖము, విషాదంతో నిండి పోయింది. తాను వీళ్లందరినీ చంపాలి అనే ఆలోచన రాగానే గుండె బరువెక్కింది. ఇరు పక్షాలలో లక్షల కొద్దీ సైనికులు ఉన్నారు. వాళ్లెవరో కూడా తనకు తెలియదు కేవలం పొట్టకూటి కోసం సైనికులుగా చేరారు. అమ్మో వీళ్లందరూ ఏం పాపం చేసారని వీళ్లను నేను చంపాలి, వీళ్లంతా ఈ యుద్ధంలో చస్తే వీళ్ల భార్యాబిడ్డలు, వృద్ధులైన తల్లి తండ్రుల గతేమిటి? అనే కరుణ తయ జాలి మలసంతా నిండి పోయింది. తన భావాలు ఎవరితో చెప్పుకోవాలి. ఎదురుగా కృష్ణుడు ఉన్నాడు. తల ఎత్తి కృష్ణుడు ఇలా అన్నాడు.

సీదంతి మమ గాత్రాణి ముఖం చ పరిశుష్యతి |
వేపథుశ్చ శరీరే మే రోమహర్షశ్చ జాయతే || 29 ||
గాండీవం స్రంసతే హస్తాత్త్వక్చైవ పరిదహ్యతే |
న చ శక్నోమ్యవస్థాతుం భ్రమతీవ చ మే మనః || 30 ||

కృష్ణా! అందరినీ చూచానయ్యా! నా సైన్యాన్ని చూచాను. కౌరవ సైన్యాన్ని చూచాను. నా వాళ్లను చూచాను. ఎదుటి పక్షంలోని వాళ్లను చూచాను. ఇంతాసేపటిలో యుద్ధం మొదలవుతుంది. వీళ్లంతా ఒకరితో ఒకరు కొట్టుకొని చస్తారు. లేకపోతే నా చేతిలో చస్తారు. ఇదంతా అవసరమంటావా! నా తాతలు, గురువులు, స్నేహితులు, తండ్రులు, కుమారులు నా చేతిలో చస్తారు అనే మాట తలచుకుంటేనే ఒళ్లంతా చెమటలుపడుతున్నాయి. భయంతో వణికిపోతున్నాను. నోరు ఎండి పోతూ ఉంది. నిలబడలేకపోతున్నాను. కళ్లు తిరుగుతున్నాయి.

కృష్ణా! ఇదేంటయ్యా..... నా గాండీవం కూడా చేతిలో నిలవడం లేదు. జారిపోతూ ఉంది. అస్త్రములు గుర్తుకురావడం లేదు. నాకు ఏమయింది. ఏదో భ్రమ కలుగుతూ ఉంది. చర్మం అంతా వణుకుతూ ఉంది. మనస్సు నిలకడగా ఉండటం లేదు. పిచ్చి పిచ్చి ఆలోచనలతో మనసంతా వికలమైపోతూ ఉంది. ఇంక నా వల్ల కాదు. నా కాళ్లు వణుకుతున్నాయి. నిలబడలేకపోతున్నాను. అన్నీ దుశ్శకునాలు కనపడుతున్నాయి. ఈ యుద్ధంలో మనకు విజయం కలిగే సూచనలు కనపడటం

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

లేదు. విజయం కలగనపుడు ఇంతటి మారణ హోమం అవసరమా అనిపిస్తూ ఉంది. నావాళ్లు అందరూ చావడం తప్పనిసరి అనిపిస్తూ ఉంది. ఇది అంతా నేను భరించలేను. ఈ యుద్ధం మనకు ఏ విధంగా కూడా శేయస్సును కలిగిస్తుంది అన్న నమ్మకం నాకు కలగడం లేదు. శ్రేయస్సుకలగని పని చేయడం వృథా కదా!

ఈ శ్లోకాలు అర్జునుని మానసిక స్థితిని, శారీరక స్థితిని, తెలుపుతున్నాయి. దీని కంతా క్లారణం స్వజనం దృష్ట్వాతన వాళ్లను చూచి, వాళ్లంతా తన వావాళ్లను చూచి వాళ్లంత తన చేతిలో చస్తారేమో అనే మోహం భ్రమ మనలో కూడా సాధారణంగా పక్కింటి వాడికి కానీ, పక్కవీధిలో వాడికికాని ఏదన్నా జరిగితే అయ్యోపాపం అని ఊరుకుంటాము. అదే మనకు, మన కుటుంబీకులకు కానీ ఇసుమంత జరిగితే మూడులోకాలు ఒకటి చేస్తాము. నానాహడావిడీ చేస్తాము. మానసికంగా అందోళన చెందుతాము. డాక్టర్ల వెంట లాయర్ల వెంట అధికారుల వెంట, పరుగులు పెడతాము. నానాయాగీ చేస్తాము. ఇదంతా దేని వలన జరిగింది అంటే ఒరటే జవాబు. నావాళ్లు, స్వజనం. ఇదే మనలనందరినీ మోహంలో పడవేస్తుంది. అదే మోహంలో ఉన్నాడు అర్జునుడు. తన వాళ్లకు ఏమో అిరిగిపోతుంది అని విషాదంలో మునిగిపోయాడు.

ప్రాణం ఉన్న ప్రతి వాడికీ భావోద్రేకాలు, కోరికలు, ఆశాపాశాలు, అనుబంధాలు ఉంటాయి తప్పవు. కాని అవి మితిమీరితేనే ప్రమాదం. బుద్ధి, విచక్షణా జ్ఞానం ఉపయోగించి వాటిని అదుపులో ఉంచుకోవాలి. అవి అదుపులో ఉంటే మానసిక సంఘర్షణ, మానసిక క్షోభ కలుగదు. అదుపులో ఉంచుకోవడం మానవునికి సాధ్యం కాదు. సాధ్యం కాకపోగా ఆ మానసిక క్షోభ శరీరం అంతా పాకుతుంది. దీని పర్యవసానమే బిపి, షుగర్ లెవల్సు పెరగడం. ఒళ్లంతా చెమటలు. వణుకు, దడ కళ్లు బైర్లుకమ్మడం, నిలబడలేకపోవడం. నరిగ్గా ఇదే వరిస్థితిలో ఉన్నాడు అర్జునుడు. పోనీ అక్కడ ఏమన్నా జరిగిందా అంటే ఏమీ జరగలేదు. ఇంకా యుద్ధం మొదలవలేదు. ఎవరూ చావలేదు అంతా క్షేమంగా ఉన్నారు. యుద్ధం జరిగితే, నేను భయంకరంగా యుద్ధం చేస్తే, నా వాళ్లు, నా బంధువులు మిత్రులు అందరూ చస్తే అమ్మో! ఇంకేమన్నా ఉందా! ఇదీ అర్జునుడి భయానికి విషాదానికి కారణం. దీనికి మన వాళ్లు ఒక అందమైన సామెత చెబుతారు. కీడెంచి మేలెంచు. ఇది ఒక కృర్థమైన సామెత. రైలు, బస్సు ఎక్కేముందు ఈ రైలు బస్సుకు ప్రమాదం జరిగితే అనే శంక కలిగితే ఎవరూ ప్రయాణాలుచెయ్యరు. అలాగే అర్జునుడు కూడా ఇక్కడ జరగబోయే కీడును గురించి దఃఖపడుతున్నాడు. పోని అర్జునుడు ఏమన్నా పిరికి వాడు, దుర్బలుడా అంటే అదీ కాదు. మహా వీరుడు. అత్యుత్తమ ధనుర్ధారి.

అమరనాధ్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

మహారథుడు. ఒకే సమయంలో పదివేల మందిని నిలువరించగల మహావీరుడు. కాబట్టి శారీరక బలం ఎంత ఉన్నా, మానసికంగా దుర్బలుడు అయితే, ఒక విధమైన బ్రమ అతనిని ఆవహిస్తే, శారీరక బలం ఎందుకూ పనికిరాదు. అదే అర్జునుడి విషయంలో జరిగింది తనవాళ్లంతా తన చేతిలో చస్తారేయో అనే భ్రమలో ఉన్నాడు అర్జునుడు.

నిమిత్తాని చ పశ్యామి విపరీతాని కేశవ |
న చ శ్రేయోఽనుపశ్యామి హత్వా స్వజనమాహవే || 31 ||

మనసు ఆందోళనలతో నిండి ఉన్నపుడు అన్నీ విపరీతంగానే కనిపిస్తాయి. తాడే పాముగా భయపెడుతుంది. ఇంక శకునాల సంగతి సరేసరి. మనోదౌర్బల్యానికి గుర్తు అవశకునాలు. గాలి గట్టిగా వీచి దీపం కానీ, హారతి గానీ ఆరిపోతే అదో పెద్ద అపశకునం. ఒకప్పుడు ముత్తయిదువుగా తిరిగిన ఒక ఇల్లాలు, కాల వశాత్తు భర్తను పోగొట్టుకుంటే, ఆమె ఎదురువస్తే అది అవశకునం. కుక్క పిల్లి నీళ్ల కుండ ఎదురు రావడం, కాకులు అటు ఇటు తిరగడం ఇవన్నీ శకునాలను సూచిస్తాయి. ధైర్యంగా ముందుకు దూకే వాడికి ఇవి పట్టవు. సందేహాజీవులు, ప్రతిదీ అనుమానించేవారికే ఇవన్నీ పట్టింపులు. వీరుడైన అర్జునుడు యుద్ధానికి ముందు శకునం చూచుకొని బయలుదేరాడో లేదో తెలియదు కానీ, ప్రస్తుతం మనోదౌర్బల్యానికి లోనయ్యాడు కాబట్టి అపశకునాల మాట ఎత్తాడు.

ఈ శ్లోకంలో కూడా మరల స్వజనం మాత్వాఅనే మాట వాడారు వ్యాసులవారు. నా వాళ్లందరినీ చంపి. దుర్మార్గులను చంపి ధర్మం నిలబెట్టడం అనే పవిత్రమైన ఆశయంతో అర్జునుడు యుద్ధానికివచ్చాడు, కానీ, ఎదురుగా స్వజనం అనగా తన వాళ్లు కనపడేటప్పటికి జవగారిపోయాడు. నా వాళ్లందరినీ చంపితే నాకే లాభం అనే స్థితికి దిగజారాడు.

న కాంక్షే విజయం కృష్ణ న చ రాజ్యం సుఖాని చ |
కిం నో రాజ్యేన గోవింద కిం భోగైర్జీవితేన వా || 32 ||

ఇంతెందుకయ్యా బావా! నాకు ఈయుద్ధమూ వద్దు. ఈ విజయమూవద్దు. ఈ రాజ్యమూ వద్దు. రాజభోగాలు, సుఖాలుఅసలే వద్దు. పన్నెండేళ్లు అడవులలో ఉన్నాము. ఏం సుఖాలు అనుభవించాము చెప్పు, కృష్ణా! ఈ యుద్ధం చేసి, ఇంత మందిని చంపి, మారణ హూమం సృష్టించి రాజ్యాన్ని గెలుచుకుంటే ఒరిగేదేముంది. ఈ రాజభోగాల వలనా సుఖమయ జీవితం వలనా ఏం ప్రయోజనం? ప్రయోజనం

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

లేని పని చేయడం ఎందుకు? అసలు ఈ జీవితం ఎందుకు? అన్నీ వృథా!

అర్జునుడు రాజ్యాలు, సుఖాలు, భోగాలు వీటితో కూడిన విలాసవంతమైన జీవితం, ఏదో వీటి మీద వైరాగ్యం పుట్టి వద్దనడం లేదు. తన వారు, తన బంధు మిత్రులు లేకుండా, ఇవన్నీ ఎందుకు అంటున్నాడు. అంటే తనవారందరూ ఉంటే, తన వారు, తనకున్న రాజ్యము సంపదలు భోగధాగ్యాలు తాను అనుభవించడం చూస్తూ ఉంటే, ఈరాజ్యమే కాదు ఇంకా ఇతర రాజ్యాలు ఉన్నా ఇబ్బందిలేదు. కాబట్టి ఇక్కడ ఉన్న మూలం ఏమిటంటే తన వారులేని ఈ సుఖాలు భోగాలు, సుఖజీవితం నాకు వద్దు అనే తాత్కాలిక వైరాగ్యంలో ఉన్నాడు అర్జునుడు.

ఇదీ ప్రస్తుత అర్జునుడి మానసిక పరిస్థితి. ఇప్పటిదాకా కౌరవసభలో జరిగిన అవమానానికి ప్రతీకారం తీర్చుకోవాలి, యుద్ధం చేయాలి సర్వనాశనం చేయాలి అని ఊగిన అర్జునుడు ఎదురుగా తన వాళ్లు కనపడేసరికి ఒక్కసారిగా మానసిక ఆందోళనకు గురిఅయ్యాడు..

పదమూడేళ్లు రాజ్యసుఖాలకు దూరంగా ఉండి ఎప్పుడెప్పుడు యుద్ధం చేసి, రాజ్యం గెలుచుకొని పూర్వవైభవాలు అనుభవిద్దామా అని ఉవ్విళ్లూరిన అర్జునుడు ఇప్పుడు తన వాళ్లందరూ చస్తారు అనే ఆలోచన రాగానే ఆ రాజ్యభోగాలు తుచ్ఛంగా తోచాయి. దీని కంతా మనస్సే కారణం. ఒకప్పుడు కావాలి అనుకున్నది మరొకప్పుడు వద్దు అనిపిస్తుంది. ఒకప్పుడు ధర్మం మరొకప్పుడు అధర్మంగా తోస్తుంది. ఇదంతా సమస్యను తన కోణం నుండి చూడటం వలననే జరుగుతుంది. నేను యుద్ధం చేయాలి. నా చేతిలో వీళ్లంతా చస్తారు. అనే భావన రాగానే అర్జునుడి మనసు వికలం అయింది. వికలమైన మనస్సుకు అన్నీ విపరీతంగానే కనపడతాయి. ఇంకా ఇలా అంటున్నాడు అర్జునుడు .

యేషామర్థే కాంక్షితం నో రాజ్యం భోగాః సుఖాని చ |
త ఇమేఽవస్థితా యుద్ధే ప్రాణాంస్త్యక్త్వా ధనాని చ || 33 ||

మనము ఎవరికై ఈ రాజ్యమును, భోగములను, సుఖములను కోరుకొనుచున్నామో, వారే ధనప్రాణముల యెడ ఆశలు వదలుకొని యుద్ధమునకు వచ్చియున్నారు.

ఆచార్యాః పితరః పుత్రాస్తథైవ చ పితామహాః |
మాతులాః శ్వశురాః పౌత్రాః శ్యాలాః సంబంధినస్తథా || 34 ||

గురువులు, తండ్రులు, తాతలు, కొడుకులు, మనుమలు, మేనమామలు, మామలు, బావమరుదులు, ఇతర బంధువులు మొదలగువారు అందరు ఈ రణరంగమునకు

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

వచ్చియున్నారు. నిజంగానే ఇది ఎంత విషాదకరమైన సన్నివేశం! నిన్నటి దాకా ఏ పూజ్యులకైతే (గురువులు, తాత, పినతండ్రులు, పెద తండ్రులు, మేనమామలు, మామలు) భక్తితో పాదాభివందనాలు చేసారో వారికి ఈ నాడు ఎదురు నిలబడి పోరు సల్పడమా? ఏ గురువు దగ్గరైతే శుశ్రూష చేసి ధనుర్విద్య నేర్చుకున్నారో, ఆ గురువు మీదకు విల్లు ఎక్కుపెట్టి శరాలు సంధించడమా? కుమారులు (ఉపపాండవులు, అభిమన్యుడు కూడా), మనుమలు, బావమరుదులు-ఇలా మొత్తం స్వజనులందరూ రణరంగంలో నిలిచి ఒకరితో ఒకరు పోరు సలపడమా? ఎంత బాధాకరమైన పరిస్థితి? పోరు ముగిసాక ఎవరు మిగులుతారో, ఎందరు మరణిస్తారో ఎవరికి తెలుసు? శ్మశానంలో సింహాసనం ఏర్పాటు చేసుకుని రాజ్యమేలాలా? అందుకే అర్జునుడికి వైరాగ్యం కలిగింది. ఐతే ఇది ధర్మబద్ధమేనా, లేక కేవలం అతడి అజ్ఞానమా అన్న విషయం పరమాత్మ నిర్ణయించ బోతున్నాడు. మనం కూడా జాగ్రత్తగా అనుసరిద్దాం.

ఏతాన్న హంతుమిచ్ఛామి ఘ్నతోఽపి మధుసూదన |
అపి త్రైలోక్యరాజ్యస్య హేతోః కిం ను మహీకృతే || 35 ||

కృష్ణా! ఇప్పుడేచెబుతున్నాను. నేను ఈ యుద్ధం చేస్తే కేవలం కురు సామ్రాజ్యమే కాదు, భూలోకము, భువర్లోకము, సువర్లోకము నాకు లభించినా, ఈ మూడు లోకములకు నన్ను పట్టాభిషిక్తుడిని చేస్తాను అన్నా నేను యుద్ధం చేయను. ఇదే నా తుది నిర్ణయం. కృష్ణా! నీవు ఒక మాట అనవచ్చు. "నువ్వుయుద్ధం చేయకపోతే ఎదుటి వాళ్లు ఉరుకుంటారా! వాళ్లను నీవు ఒప్పించగలవా! వాళ్ల పాటికి వాళ్లు యుద్ధం చేస్తారు. ఆ యుద్ధంలో వాళ్లు నిన్నుచంపవచ్చు" అని నువ్వు అనవచ్చు. దానికీ నేను భయపడను. వాళ్ల పాటికి వాళ్లను యుద్ధం చెయ్యనీ. ఆ యుద్ధంలో నిరాయుధిడిని అయిన నన్ను చంపనీ. నేను మాత్రం ఎవరిమీదా ఆయుధం ప్రయోగించను - ఎవరినీ చంపను. వారితో యుద్ధం చేయను. అంతే.

ఈ శ్లోకంలో అర్జునుడు కృష్ణుని మధుసూదనా! అని సంబోధించాడు. మధుసూదనా అంటే మధు అనే రాక్షసుని సంహరించిన వాడా! అని అర్థం. అంటే ఓ కృష్ణా! నువ్వు మధువు అనే వాడిని రాక్షసుడు కాబట్టి సంహరించావు. వీడినే కాదు ఎంతో మంది రాక్షసులను సంహరించావు. కాని నా ఎదురుగా నిలబడ్డవాళ్లు రాక్షసులు కాదు. సాక్షాత్తు నా తాతలు, తమ్ములు, కొడుకులు బంధువులు, వీళ్లను ఎలా సంహరించాలి! అనే అర్థంతో వ్యాసుల వారు ఈ పదం వాడారు అని పెద్దలు చెబుతారు

అమరనధ్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

నిహత్య ధార్తరాష్ట్రాన్నః కా ప్రీతిః స్యాజ్జనార్దన |
పాపమేవాశ్రయేదస్మాన్హత్వైతానాతతాయినః || 36 ||

ఓ జనార్దనా! ఈ ధార్తరాష్ట్రులను చంపి మనము ఏమి బావుకొందుము? దుర్మార్గులైనప్పటికీ, వీరిని వధించినందు వలన మనకు పాపమే కలుగును.

అగ్నిదోగరదశ్చైవ శస్త్రపాణి ర్ధనాపహృత్ |
క్షేత్రదారహరశ్చైవ షడైతే హ్యతతాయినః ||

ఇళ్ళకి నిప్పు పెట్టేవారిని, విషప్రయోగం చేసే వారిని, కారణం లేకుండా శస్త్రాస్త్రములను ధరించేవారిని, పరధనములను అపహరించేవారిని, పరుల భూములను అపహరించే వారిని, పరుల భార్యలను అపహరించే వారిని - ఈ ఆరుగురిని ఆతతాయిలంటారు.

అర్జునుడు 'జనార్దన!' అని సంబోధించడం జరిగింది. 'ఓ శ్రీకృష్ణా! ప్రళయకాలంలో నీవు సర్వజనసంహారం చేసినప్పటికీ, నీవు పరమాత్మవు కనుక నిన్ను ఏ పాపమూ అంటదు. కాని నాకు అలా కాదు కదా? ఇందరు స్వజనులను వధిస్తే ఆ పాపం నాకు తప్పకుండా చుట్టుకుంటుంది.' అని అర్జునుడు జనాంతికంగా అన్నాడు.

తస్మాన్నార్హా వయం హంతుం ధార్తరాష్ట్రాన్స్వబాంధవాన్ |
స్వజనం హి కథం హత్వా సుఖినః స్యామ మాధవ || 37 ||

కనుక ఓ మాధవా! మన బంధువులైన ఈ ధార్తరాష్ట్రులను, వారు దుర్మార్గులైనప్పటికీ, చంపుట మనకు తగదు. స్వజనులను చంపిన మనకు సుఖము ఎట్లు కలుగును?

అర్జునుడు స్వ, స్వ అని కలవరిస్తున్నాడు. స్వబాంధవాన్, స్వజనం...... అంటే నేను, నాది అన్న అహంకారం, మమకారం అతనిలో బాగా వున్నాయి. ఈ రెండూ కూడా జీవుడికి మోక్షమార్గంలో మహా ప్రతిబంధకాలై నిలిచి వుండేవి. 'ఈ దేహమే నేను; అని అనుకుంటున్నంత వరకు, ఈ దేహాభిమానం వున్నంత వరకు జీవుడు భవబంధాల నుంచి విముక్తుడు కాలేడు. అందుకే ఇప్పుడు శ్రీకృష్ణపరమాత్మ 'నీవు ఆత్మవే కాని దేహానివి కాదు' అన్న అఖండ జ్ఞానోపదేశం ద్వారా అతడిలో వున్న అహంకార, మమకారాలను తొలగించడానికి పూనుకున్నాడు.

యద్యప్యేతే న పశ్యంతి లోభోపహతచేతసః |
కులక్షయకృతం దోషం మిత్రద్రోహే చ పాతకమ్ || 38 ||

కథం న జ్ఞేయమస్మాభిః పాపాదస్మాన్నివర్తితుమ్ |
కులక్షయకృతం దోషం ప్రపశ్యద్భిర్జనార్దన || 39 ||

అమరనధ్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

కృష్ణా! ఈ దుర్యోధనుడు, దుశ్శాసనుడు పరమ లోభులు. వారికి రాజ్యకాంక్ష, పదవీ కాంక్ష రాజ్యసుఖాలు తప్ప మరొకటి తెలియదు. వీళ్ల మనసులు భ్రష్టుపట్టాయి. వీరు బంధువులకే కాదు తమ మిత్రులకు కూడా ద్రోహం చేస్తున్నారు. ఎక్కడెక్కడి రాజులనో పిలిపించి ఈ యుద్ధంలో చచ్చేటట్లు చేస్తున్నారు. ఈ పాపాత్ములకు తాము చేస్తున్నది తప్పు, ద్రోహము, పాపము అని తెలియదు. ఈ యుద్ధం జరిగితే కలిగే వినాశనాన్ని వీళ్లు చూడలేరు. అది అటుండనీ మనకు అన్నీ తెలుసు కదా! ఈ యుద్ధం జరిగితే అందరూ మరణిస్తారు. మగవాడు అంటూ మిగలడు. దానితో కులక్షయం అవుతుంది. కుటుంబాలకు కుటుంబాలు, వంశాలకు వంశాలు నాశనం అవుతాయి అని మనకు బాగా తెలుసు. వంశక్షయం వలన మహాపాపం చుట్టుకుంటుంది అని దుర్యోధనాదులకు తెలియకపోవచ్చు కానీ మనకు తెలుసు కదా!

తెలిసి తెలిసీ ఈ మహా పాపం ఎలా చెయ్యమంటావు చెప్పు. కనీసం మనం అన్నా ఈ యుద్ధం నివారించడానికి పయత్నం చేయవచ్చు కదా! నీవు రాయబారానికి వెళ్లి నీవు చేయాల్సిన ప్రయత్నం నీవు చేసావు. ఇప్పుడు కూడా దుర్యోధనుడికి నచ్చచెప్పి ఈ యుద్ధం ఆపించవచ్చు కదా! ఈ పాపం చేయకుండా నన్ను మరలించవచ్చుకదా! దుర్యోధనులు ఎటూ యుద్ధం విరమించుకోరు. కనీసం మనం అన్నా ఈ కులక్షయము అనే పాపం నుండి విముక్తులం కావచ్చు కదా! ఏమిటో! కులక్షయం అనే ఈ పాపం నుండి ఎలా విముక్తికావాలో అర్థం కావడం లేదు. అని నిర్వేదంగా అన్నాడు అర్జునుడు.

ఇప్పటి దాకా తన గురించి తన బంధువులు ఈ యుద్ధంలో చస్తారు అన్న అర్జునుడు ఇప్పుడు సమాజం గురించి, వంశక్షయం, కులక్షయము గురించి కూడా బాధపడుతున్నాడు.

కులక్షయే ప్రణశ్యంతి కులధర్మాః సనాతనాః |
ధర్మే నష్టే కులం కృత్స్నమధర్మోఽభిభవత్యుత || 40 ||

కులక్షయమైన యెడల కులధర్మములను పాటించువారు నశించెదరు. వారు లేనియెడల చిరంతనములగు కులధర్మములు (అగ్నిహోత్రాది కర్మల వలన సాధింపదగిన ధర్మములు) నశించిపోవును. అట్టి ధర్మము నశించెనేని నశింపగా మిగిలిన కులమున అధర్మము వ్యాపించుచున్నది.

అధర్మాభిభవాత్కృష్ణ ప్రదుష్యంతి కులస్త్రియః |
స్త్రీషు దుష్టాసు వార్ష్ణేయ జాయతే వర్ణసంకరః || 41 ||

అమరనాథ్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

ఓ కృష్ణా! అధర్మము పెచ్చుపెరిగిపోయినప్పుడు కులస్త్రీలు మిక్కిలి దూషితులగుదురు.

ఓ వృష్ణివంశంలో పుట్టిన మహానుభావా! వర్ణసంకరం జరుగుతుంది. ఎవరు ఎవరికి పుట్టారో, ఎవరు ఏ వర్ణమో, ఏ కులమో తెలియకుండా పోతుంది. ఈ వంశాలు ఎటుపోతాయో తెలియదు. ఇది నా వంశము అని గర్వంగా ఎవరూ చెప్పుకోలేరు. ఈ యుద్ధం వల్ల ఎంత అనర్థం దాపురిస్తుందో ఆలోచించు. అంతటితో ఆగదు కృష్ణా! ఈ శ్లోకంలో అ ధర్మాభిభవాత్ అని అన్నారు వ్యాసులవారు. అంటే అధర్మము వృద్ధి చెందినపుడు అని అర్ధం. అధర్మం అంటే ఏమిటి. పురుషార్థాలు నాలుగు ధర్మ, అర్థ, కామ, మోక్షములు, ధర్మం అంటే ఎదుటివాడు మనసా, వాచా, కర్మణా, తనకు ఏమి చేస్తే అది తనకు బాధ కలుగుతుందో ఆ పని చేయకపోవడం, ఇతరులకు ఉపకారం చేయడం. ఇదీ సాధారణ ధర్మం. ఆ సాధారణ ధర్మమును అనుసరించి ధనం, సంపదలు సంపాదించడం, ధర్మబద్ధమయిన కామములు అంటే కోరికలు కోరుకోవడం, ఈ సంపదలు, ధనము, కర్మలు, కోరికలు వీటి అన్నిటి ఫలితములను వదిలిపెట్టడం. అదే మోక్షము. ఇంక అధర్మము. అంటే ధర్మము అనే మాటను పైవాటి నుండి తొలిగించడం. అంటే ఏదో విధంగా ధనము, సంపదలు సంపాదించడం, అడ్డమైన కోరికలు అన్నీ కోరుకోవడం వాటిని తీర్చుకోవడానికి అడ్డదారులు తొక్కడం. ఈ రెండింటిలోనే సుఖము, సంతోషము ఉందనుకోవడం ఇదే అధర్మము. ఇక్కడ అధర్మం వృద్ధి పొందుతుంది అంటే భర్తలు లేని భార్యలు అంటే కుల స్త్రీలు కామమునకు, కోరికలకు లోనై దూషితలు అవుతారు. దాని వలన వర్ణ సంకరం ఏర్పడుతుంది.

సంకరో నరకాయైవ కులఘ్నానాం కులస్యచ|
పతంతి పితరో హ్యేషాం లుప్తపిండోదక క్రియా ॥ 42 ॥

కృష్ణా! ఈ ప్రకారంగా కులస్త్రీలు స్వేచ్ఛగా తిరిగితే, వర్ణ సంకరం జరిగితే, కులవ్యవస్థ నాశనం అయితే, దీనికి కారణం అయిన వాళ్లంతా కులఘాతకులు అవుతారు. అటువంటి వాళ్లు నరకానికి పోతారు. అటువంటప్పుడు ఈ యుద్ధంలో చచ్చిన వాళ్లకు జల తర్పణాలు ఎవరు విడుస్తారు. పిండప్రదానం ఎవరు చేస్తారు, వారిని ఉత్తమలోకాలకు ఎవరు పంపిస్తారు. ఈ యుద్ధంలో మరణించిన వాళ్లకు అంత్యక్రియలు. శ్రాద్ధకర్మలు జలతర్పణాలు.పిండప్రదానాలు లేకపోతే, వారంతా అధోగతి పాలు అవుతారు కదా! తలచుకుంటేనే అంతా అయోమయంగా ఉంది. దీని కంతా ఈ యుద్ధమే కారణం కాదా! ఆలోచించు.

అమరనథ్ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

దోషైరేతైః కులఘ్నానాం వర్ణసంకరకారకైః ||
ఉత్సాద్యంతే జాతిధర్మాః కులధర్మాశ్చ శాశ్వతాః || 43 ||

వర్ణసంకరములకు మూలములైన ఈ దోషముల వలన కులఘాతకుల యొక్క సనాతన కులధర్మములు, జాతిధర్మములు నష్టమగును.

ఉత్సన్నకులధర్మాణాం మనుష్యాణాం జనార్దన |
నరకేఽనియతం వాసో భవతీత్యనుశుశ్రుమ || 44 ||

ఓ జనార్దనా! కులధర్మములు నశించిన వారికి శాశ్వతముగా నరకవాసము తప్పదని ప్రతీతి.

అంతేకాదు కృష్ణా! అక్షౌహిణీలకొద్ది సైన్యం చావడానికి, దాని వలన కలిగే వర్ణసంకరానికి, కులక్షయానికి, కులధర్మాలు నాశనం రావడానికీ, జతి ధర్మాలు అన్నీ శాశ్వతంగా నాశనం కావడానికీ ఈ యుద్ధమే కారణము. అందులో సందేహము లేదు ఈ యుద్ధంలో మరణించిన వారికీ, వారి భార్యలకు, సంతానానికీ, యుద్ధం చేసి కులధర్మాలు, వర్ణసంకరాలు జతిధర్మాలు నాశనం కావడానికి ఈ యుద్ధం కారణము. అందులో సందేహము లేదు. ఈ యుద్ధంలో మరణించిన వారికీ, వారి భార్యలకు, సంతానానికి, యుద్ధం చేసి కులధర్మాలు, వర్ణనంకరాలు, జాతిధర్మాలు నాశనం కావడానికి కారణం అయిన ఈ యుద్ధం చేసిన వారికి కూడా శాశ్వత సరకలోం ప్రాప్తిస్తుందని పెద్దలు చెప్పగా విన్నాను. నిజం కాదంటావా! ఇన్ని అనర్థాలకు మూలం అయిన ఈ యుద్ధం నేను చేయడం అవనరమంటావా!

అహో బత మహత్పాపం కర్తుం వ్యవసితా వయమ్ |
యద్రాజ్యసుఖలోభేన హంతుం స్వజనముద్యతాః || 45 ||

కృష్ణా! మరలా చెబుతున్నాను. దుర్యోధనాదులు నరే వెధవలు, ఆతతాయిలు, దుర్మార్గులు, దుష్టులు. వారి బుద్ధి వనిచేయడంలేదు. అందుకే యుద్ధానికి సన్నద్ధం అయ్యారు. మనం బుద్ధిమంతులం కదా! ఇంత దారుణాన్ని, మహాపాపాగ్ని చేయడానికి ఎలా సిరద్ధపడ్డామో అర్థంకాకుండా ఉంది. ఇదంతా దేనికి? రాజ్యం కోసం, రాజభోగాలు అనుభవించడం కోసం. అంతే కదా! ఈ తుచ్ఛమైన రాజ్యానికి, రాజ్యభోగాలకు ఆశపడి బంధువులను, మిత్రులను చంపి. ఘోరమైన పాపం చేసి, చచ్చిన వాళ్లకు కర్మకాండలు, జలతర్పణాలు, పిండపదానాలు లేకుండా చేసి, అధర్మానికి ఒడిగట్టి, శాశ్వతనరకలోక వాసం కొని తెచ్చుకోమంటావా! ఇది ఎంత ఘోరమో, దారుణమో నీకు తెలుసా! దీని గురించి ఎప్పుడైనా ఆలోచించావా!

అమరనాథ అమర్

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

యది మామప్రతీకారమశస్త్రం శస్త్రపాణయః |
ధార్తరాష్ట్రా రణే హన్యుస్తన్మే క్షేమతరం భవేత్ || 46 ||

కృష్ణా! ఇన్ని మహాపాపాలు చేసి, నరకంలో శాశ్వతంగా నివాసం ఏర్పరచుకోడం కంటే, గాండీవం వదిలిపెట్టి, అస్త్రసన్యాసం చేయడం మేలు. యుద్ధం చేయకుండా ఉండటం ఉత్తమం. ఒకవేళ శతువులు నన్ను చంపినా బాధలేదు. వీరస్వర్గానికిపోతాను. అంతే కానీ నరకానికి పోను. అదే నాకు క్షేమం అని తలుస్తాను. ఈ యుద్ధంచేసి, అందరినీ చంపి, వాళ్ల భార్యలను దూషితలుగా చేసి, వర్ణసంకరం, కులక్షయం చేసి, పిల్లకు కనీసం పిండాలు పెట్టే దిక్కు కూడా లేకుండా చేసి, ఘోరపాపాలు మూటగట్టుకొని శాశ్వతంలో నరకంలో పడేకంటే, నిరాయుధుడనై శత్రువులచేతిలో చచ్చి స్వర్గానికి పోవడం మేలు కదా! ఏమంటావు కృష్ణా.

అని అర్జునుడు తానే అన్నీ చేస్తున్నట్టు, తన వల్లే అన్నీ జరుగుతున్నట్టు జరగబోయే పరిణామాలకు అన్నిటికీ తానే బాధ్యుడు అయినట్టు ఊహించుకుంటూ, ఊహాలోకాల్లో తేలిపోతూ, తెగ బాధపడిపోయాడు. విషాదంలో మునిగిపోయాడు. దు:ఖంతో కుంగి పోయాడు.

ఇది అర్జునుడి మానసిక స్థితి. శారీరకంగా ఎలా ఉన్నాడో సంజయుడు చెబుతున్నాడు.

ఏవముక్త్వార్జునః సంఖ్యే రథోపస్థ ఉపావిశత్ |
విసృజ్య సశరం చాపం శోకసంవిగ్నమానసః || 47 ||

ఇప్పుడుసంజయుడు ధృతరాష్ట్రునితో ఇలా అన్నాడు. "మహారాజా! ఆ ప్రకారంగా అర్జునుడు, మనసంతా శోకంతో, శత్రువుల మీద దయతో, జాలిలో, కరుణతో నిండిన వాడై, తాను యుద్ధం చేస్తే పాపం వస్తుందనీ, యుద్ధం చేసి పాపం మూటకట్టుకోడం కంటే శత్రువులచేతిలో చానడం మోలు పాపం అని తలంచి తన గాండీవమును, అస్త్ర, శస్త్రములను కిందపెట్టి, రథం వెనుక భాగాన ఏమీ చేతకాని వాడి వలె కింద కూర్చున్నాడు.

ఇక్కడ ధనుర్బాణములను వదిలిపెట్టడం అంటే తన స్వధర్మము అయిన క్షాతధర్మమును వదిలిపెట్టాడు అని అర్థం. ఇంక కృష్ణుడికి మిగిలిన అవకాశాలు రెండే. ఒకటి రథం వెనక్కుతిప్పుకొని వెళ్లిపోవడం. రెండవది అర్జునుడికి ధైర్యం చెప్పి యుద్ధము చేయడానికి ప్రోత్సహించడం కృష్ణుడు రెండవ మార్గాన్ని ఎన్నుకున్నాడు. అదేమిటో రెండవ అధ్యాయం నుండి తెలుసుకుందాము

భగవద్గీత

మొదటి అధ్యాయము

అర్జునవిషాదయోగః

ఉపనిషత్తులయొక్క, బహ్మవిద్యయొక్క, యోగశాస్త్రము యొక్క సారమయిన భగవద్గీతలో, అర్జున విషాద యోగము అను మొదటి అధ్యాయము సంపూర్ణము

ఓం తత్సత్ ఓం తత్సత్ ఓం తత్సత్ - ఓం నమో భగవతే వాసుదేవాయ!

ఇతి శ్రీమద్భగవద్గీతాసూపనిషత్సు బ్రహ్మవిద్యాయాం యోగశాస్త్రే శ్రీకృష్ణార్జునసంవాదే అర్జునవిషాదయోగో నామ ప్రథమోऽధ్యాయః || 1 ||

ఈ విధంగా ఉపనిషత్తు, బ్రహ్మవిద్య, యోగశాస్త్రము, శ్రీకృష్ణార్జున సంవాదము అయిన భగవద్గీత యందు అర్జున విషాద యోగం అనే మొదటి అధ్యాయము సమాప్తము.

యుద్ధ ప్రారంభము సందర్భముగా శంఖనాదాలు

www.sanatanadharm.com

అమరనథ్ అమర్

శ్రీమద్భగవద్గీత
Srimad Bhagavad Gita

శ్రీమద్భగవద్గీత
Srimad Bhagavad Gita

శ్రీమద్భగవద్గీత - Srimad Bhagavad Gita

అమరనథ్ అమర్